క్లుప్తంగా

అట్టహాసంగా పీర్ల ఊరేగింపు



చిత్తూరు నగరంలో పీర్లను ఊరేగిస్తున్న నిర్వాహకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకుని చిత్తూరు నగరంలోని ముస్లింలు బుధవారం పీర్లను అట్టహాసంగా ఊరేగించారు. డప్పు వాయిద్యాలకు అనుగుణంగా యువకులు చిందులేశారు. ముందుగా పీర్లు కొలువుదీరిన ప్రాంతంలో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేపట్టారు. తదనంతరం భక్తిశ్రద్ధలతో ఊరేగింపు ప్రారంభించారు.

హాస్టళ్లలో వసతులు కల్పించాలి

చిత్తూరు కార్పొరేషన్: సంక్షేమ హాస్టళ్లలో సీజనల్ వ్యాధులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. వాతావారణం మార్పు, వర్షాలతో జలుబు, జ్వరం, మలేరియా, డెంగీ తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. వీటిపై హాస్టళ్లలోని పిల్లల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. మెరుగైన సౌకర్యాలతోపాటు బలమైన ఆహారం పెట్టి వైద్య సేవలు అందుబాటులో ఉంచాలన్నారు.

నేడు డయల్ యువర్ ఎమ్మెల్యే

చిత్తూరు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం గురువారం డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్ ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో జరుగుతుందన్నారు. ప్రజలు ఏవైనా సమస్యలుంటే 98499 07885 నెంబరుకు ఫోన్ చేసి తన దృష్టికి తీసుకురావొచ్చన్నారు. ఈ కార్యక్రమానికి చిత్తూరు కార్పొరేషన్ అధికారులు, చిత్తూరు రూరల్, గుడిపాల మండలాల అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు.

దోమల నివారణపై అవగాహన

బైరెడ్డిపల్లి: దోమలు విజృంభించకుండా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండలంలోని పాతపేటలో వైద్యాధికారి విజయ్‌చంద్ర అవగాహన కల్పించారు. గ్రామంలో పర్యటించి నీరు నిల్వ ఉన్న ప్రదేశాలను గుర్తించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలని సూచించారు. దోమల నివారణకు దోమతెరలు వాడాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ, ఆరోగ్యసిబ్బంది నిరూపమ, అరబ్‌జాన్, బేగం, అంబికా పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

పెద్దపంజాణి: ప్రతిఒక్కరూ దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి రామచంద్రారెడ్డి చెప్పారు. బుధవారం ఆయన మండలంలోని బసవరాజు కండ్రిగ గ్రామంలో రాయలపేట ఆరోగ్యకేంద్రం సిబ్బందితో కలసి పర్యటించారు. ముందుగా గ్రామంలో డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి జ్వరాలపై ఆరా తీశారు. జ్వర పీడితులకు మలేరియా, డెంగీ రక్తపరీక్షలు నిర్వహించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి గంగయ్య, సర్పంచ్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

మార్కెట్‌లో పారిశుధ్య పనులు



శుభ్రమైన టమాట మార్కెట్

పలమనేరు: పలమనేరు టమాట మార్కెట్‌లో పారిశుధ్య పనులను స్థానిక మార్కెట్ కమిటీ కార్యదర్శి సంజీవ్‌కుమార్ ఆదేశాల మేరకు సిబ్బంది చర్యలు తీసుకున్నారు. అపరిశుభ్రంగా ఉన్న చోట్ల పరిశుభ్రం చేయించారు. సరుకు కోసం వచ్చే వాహనాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలను తీసుకున్నారు. మార్కెట్ సిబ్బంది స్వయంగా టమాట వేలం పాటలో పాల్గొంటున్నారు. దీంతో టమాట ధరల పెరుగుదలకు కారణమైంది. ఇటీవల టమాట రైతులు ఇక్కడ ధరల తగ్గుదలకు మండీ వ్యాపారులే కారణమంటూ ఆందోళనలకు దిగడం తెలిసిందే. ఎట్టకేలకు మార్కెట్ అధికారులు స్పందించి, పారిశుధ్య పనులు చేపట్టడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిరుద్యోగ భృతి ఎన్నడో..?



'నేను సీఎం అయిన వెంటనే ఇంటికో ఉద్యోగమిస్తా.. నిరుద్యోగ భృతి కింద రూ.3 వేలు అందిస్తా.. ఎవరూ భయపడొద్దు.. బాబు వస్తే ఇంటికి జాబొస్తాదీ..' ఇదీ ఎన్నికల సమయంలో చంద్రబాబు ఊరూరా చేసిన ప్రచారం.



- నిరుద్యోగ భృతిపై స్పష్టత కరువు
- నోరు విప్పని ప్రభుత్వం
- భృతి కోసం నిరుద్యోగుల ఎదురుచూపు
- తప్పని వలసలు

'ప్రతి ఇంటికీ ఒక ఉద్యోగం ఇస్తాం. ఉద్యోగం లేకుంటే నిరుద్యోగులకు రూ.3 వేల భృతి ఇస్తాం. తద్వారా మీ జీవన ప్రమాణం మెరుగు పడుతుంది' అని ఎన్నికల సందర్భంగా చంద్రబాబునాయుడుతో కూడిన కూటమి ప్రకటించింది. తీరా అధికారంలోకి వచ్చాక వాటి ఊసేలేదు. ఎప్పుడు ఇస్తారు.. మార్గదర్శకాలేంటి అన్నదానిపైనా స్పష్టత లేదు. ఉద్యోగ కల్పన లేదా భృతి ఏదో ఒకటి అందుతుందని ఆశించామని, ఇప్పటి వరకు ఏ విషయమూ తేల్చకుండా చంద్రబాబునాయుడు ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని నిరుద్యోగులు మండిపడుతున్నారు.

–కాణిపాకం/చిత్తూరు అర్బన్

చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గంలో 1.55 లక్షల కుటుంబాలున్నాయి. 4.22 లక్షల జనాభా నివసిస్తోంది. ప్రతి ఏటా ఇంటర్ కళాశాలల నుంచి 22 వేల మంది, డిగ్రీ కళాశాలల నుంచి 15 వేల మంది, బీటెక్ 6 వేల మంది, ఎం టెక్ 2,500, డిప్లొమా కోర్సుల నుంచి మరో 3 వేల మంది ఉత్తీర్ణులు అవుతున్నారు. ఇందులో కొందరు ఉద్యోగాలు చేస్తున్నా, మరి కొందరు ఖాళీగా ఉంటున్నారు. ప్రతి ఇంట్లో ఒక్క నిరుద్యోగి ఉంటున్నారు. కూటమి ప్రభుత్వం 80 వేల కుటుంబాలకు ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి ఇవ్వాల్సి ఉంది. చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో ఉన్న నిరుద్యోగులందరికీ ఉపాధి కల్పించి ఆదుకుంటానని చంద్రబాబు ఎన్నికల సందర్భంగా ఊదరగొట్టారు. ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగ భృతి ఇజేస్తామని చెప్పారు. అధికారంలోకి వచ్చి నెల రోజులు గడుస్తున్నా రెండు అంశాలపై అతీగతీ లేదు. మెగా డీఎస్సీ పేరుతో ప్రకటించిన పోస్టులు సైతం ఇప్పట్లో భర్తీ అయ్యే సూచనలు కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉద్యోగాలు వచ్చేస్తాయంటూ డిగ్రీ, ఇంటర్, పదో తరగతి చదివిన విద్యార్థులు కోచింగ్ సెంటర్ల బాట పట్టారు. ఇప్పటికే రూ.వేలల్లో ఫీజులు చెల్లించి శిక్షణ పొందుతున్నారు. ఉద్యోగాల కోసం నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటి వరకు సుమారు 2 లక్షల మందికిపైగా రిజిస్టర్ చేసుకున్నట్టు ఉపాధి కల్పన అధికారులు వెల్లడిస్తున్నారు. ఇక ఉద్యోగాల కోసం 30 శాతం మంది బెంగళూరు, హైదరాబాద్, చెన్నై వంటి ప్రాంతాలకు పరుగులు తీస్తున్నారు.

మళ్లీ పాత పాటేనా...

2014లో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో నిరుద్యోగులకు ప్రతి నెలా రూ.2 వేల భృతి ఇస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామని ప్రగల్భాలు పలికారు. 2019లో ఎన్నికల ముందు రెండు నెలలు భృతి ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రయత్నాలు చేశారు. అలాగే ఇంటికో ఉద్యోగం ఇస్తానని చెప్పి కొందరికి ప్రైవేటు ఉద్యోగాలు కల్పించి మిన్నకుండిపోయారు. ఇప్పుడు కూడా చంద్రబాబు తమను మోసం చేస్తారేమోనన్న అనుమానాన్ని నిరుద్యోగులు వ్యక్తం చేస్తున్నారు.

ఎదురు చూపేనా



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 2 లక్షల ఉద్యోగాలు, లేని పక్షంలో నిరుద్యోగ భృతి ఇస్తానని సీఎం చంద్రబాబు ప్రకటించారు. అధికార పగ్గాలు చేపట్టి నెల రోజులు గడుస్తున్నా అతీగతీ లేదు. అసలు ఇస్తారా? లేదా? అనే విషయంపైనా స్పష్టత లేదు. 2019 ఎన్నికల ముందు తూతూమంత్రంగా ఇచ్చారు. ఇప్పుడు అదే పంథా కొనసాగించేందుకు ప్రయత్నిస్తున్నారు.

–భరత్, పూతలపట్టు

గతంలో మాట ఇచ్చి తప్పారు



నేను 2013లో డిప్లమా పూర్తి చేశాను. గతంలో చంద్రబాబు నిరుద్యోగ భృతి రూ.2 వేలు ఇస్తామని చెప్పి మాట తప్పారు. ఎన్నికల హామీల్లో భాగంగా నిరుద్యోగ భృతి 3000 రూపాయలు ఇస్తామని నేడు హామీ ఇచ్చారు. చదువుకున్న మాకు ఉద్యోగం వచ్చేంత వరకు నిరుద్యోగ భతి ఇవ్వాలి. ఇచ్చిన హామీ మేరకు ఆంక్షలు విధించకుండా పథకాన్ని అమలు చేయాలి.

–సుహేల్ అహ్మద్, బంగారుపాలెం

ఎన్నికల హామీలన్నీ నెరవేర్చాలి



జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. గతంలో మాదిరి కాకుండా తక్షణమే భృతిని ప్రకటించాలి. ఒక్క నెల నోటిఫికేషన్ ఆలస్యమైతే ఉద్యోగానికి లక్షలాది మంది వయోపరిమితి దాటి ప్రభుత్వ ఉద్యోగానికి అర్హత కోల్పోతాడు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ప్రతి ఇంటికీ ఉద్యోగం ఇవ్వాలి. లేకుంటే నిరుద్యోగ భృతిని అమలు చేయాలి.

–సురేష్, దిగువ మోదలపల్లి, తవణంపల్లి

నిరుద్యోగ భృతి హామీ నిలబెట్టుకోవాలి



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. నిరుద్యోగ భృతి పథకాన్ని నీరు గార్చకుండా త్వరితగతిన ప్రారంభించి నిరుద్యోగులకు చేయూతనివ్వాలి. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉద్యోగాల కోసం సిద్ధమయ్యేవారు ఇంట్లో వారికి భారమవ్వకుండా చేయూతనిచ్చే నిరుద్యోగ భృతి వీలైనంత త్వరగా అమలు చేయాలి. ఈసారైనా భృతి ఇచ్చి మాటను నిలబెట్టుకోవాలి.

–మోహన్, చిత్తూరు

మాట నిలుపుకోవాలి



కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతిపై మాట నిలుపుకోవాలి. ప్రభుత్వం వచ్చి నెల రోజులు దాటిన దీనిపై సీఎం చంద్రబాబునాయుడుతో పాటు విద్య, ఐటీ శాఖ మంత్రి లోకేష్ ఇంతవరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. దీనిపై మా నిరుద్యోగుల్లో అనుమానం కలుగుతోంది. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలపై సీఎం చంద్రబాబు స్పష్టత ఇవ్వాలి.

–నందకుమార్, సీపీపల్లె, ఐరాల

నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తున్నాం



నిరుద్యోగ భృతి కోసం ఎంతగానో ఎదురు చూస్తున్నాం. ప్రతి ఒక్క నిరుద్యోగికి భృతి ఇస్తామని చెప్పారు. తీరా ఇప్పుడు ఇంటర్మీడియెట్ చదివి ఉండాలనే నిబంధన పెట్టారు. ఇది అన్యాయం. ఈ నిబంధనలను సడలించి అందరికీ భృతి ఇవ్వాలి. దీని ద్వారా యువతకు ఆ డబ్బులతో జీవనానికి చేదోడుగా ఉంటుంది.

–సాయికృష్ణ, చిత్తూరు

21న శాకాంబరీ ఉత్సవం

కాణిపాకం: ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి అనుబంధ మణికంఠేశ్వర స్వామి ఆలయంలో 21న శాకాంబరీ ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని వివధ రకాల కూరగాయలతో అలంకరించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే మరగదాంబిక దుర్గాదేవికి కూరగాయలు, పండ్లతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తామని వెల్లడించారు. ఉదయం 6 గంటలకు మహా మంగళహారతి, 10 గంటలకు వ్యాస భగవానుడికి విశేష పూజలు నిర్వహిస్తామని తెలిపారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఆడి నెల బుధవారం నుంచి ప్రారంభమైంది. ఇందులో భాగంగా అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి విశేషంగా అలంకరించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో తరలివచ్చి దర్శించుకున్నారు. శుక్రవారం సంతపేట, మురకంబట్టు తదితర ప్రాంతాల్లో నాగాలమ్మ జాతర జరగనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి



శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలోని స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలో బుధవారం తొలిఏకాదశి పూజలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఈశ్వర గుడి వీధిలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం స్వామివారిని సుప్రభాతసేవలో మేల్కొలిపారు. వివిధ రకాల అభరణాలు తొడిగి సుందరమయంగా అలంకరించారు. అనంతరం అర్చన, తోమాల సేవ, నైవేద్యం సమర్పణ, తిరువారాధన చేశారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి ఏకాంతసేవ, సల్లింపు చేశారు. తొలి ఏకాదశి కావడంతో భక్తులు స్వామి దర్శనం కోసం క్యూకట్టారు. గోవింద నామస్మరణ మార్మోగించారు. అలాగే కట్టమంచిలోని వరదరాజుల స్వామి ఆలయంలో కూడా ఏకాదశి పర్వదినాన్ని భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. భక్తులు దీపారాధన చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ నాలుగు నెలల పాటు సహస్రపారాయణం, వేద పారాయణం, అష్టోత్తర సహస్రనామావళి, సహస్ర నామావళి, యజ్ఞ, హోమాలు చేస్తే సకల శుభాలు కలుగుతాయని భక్తులకు వేద పండితులు వివరించారు.

మహిళలపై జరిగే అఘాయిత్యాలపై ప్రత్యేక దృష్టి

- ఎస్పీ మణికంఠ చందోలు



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

ఐరాల: సైబర్ కేసులతో పాటు మహిళలపై జరిగే అఘాయిత్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశించారు. ఆయన బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను, సీజ్ చేసిన వాహనాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆర్థిక నేరాలను అరికట్టేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. నేరాలు జరగడానికి అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలీసుల పట్ల ప్రజలు విశ్వాసం, గౌరవం పెంపొందించేలావిధులు నిర్వర్తించాలన్నారు. పెండింగ్ కేసులు, దర్యాప్తులో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలన్నారు. రౌడీ షీటర్లు, పాత నేరస్తులపై నిఘా ఉంచాలని చెప్పారు. మాదకద్రవ్యాలు, సారా, గంజాయి రవాణాపై ఉక్కు పాదం మోపాలని స్పష్టం చేశారు. ఎవరైనా హెల్మెట్ లేకుండా, మద్యం సేవించి వాహనాలు నడిపినా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా కేసులు నమోదు చేయాలని పేర్కొన్నారు. అంతకు ముందు ఎస్పీకి ఎస్ఐ రమేష్‌బాబు తన సిబ్బందితో కలిసి గౌరవ వందనం చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, సీఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

అమర సైనికులకు నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ సైనికులు

పలమనేరు: జమ్ముకశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాదుల దాడుల్లో మృతిచెందిన వీర సైనికులకు స్థానిక మాజీ సైనికులు, వీహెచ్‌పీ నేతలు బుధవారం ఘన నివాళులర్పించారు. మృతిచెందిన వీర జవాన్ల ఫొటోలతో కూడిన బ్యానర్‌తో పట్టణంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో మిలటరీ సిద్దయ్య, తాతయ్య, ఫైనాన్స్ అమరనాథరెడ్డి పాల్గొన్నారు.

23న డ్యాన్స్ పోటీలు

శాంతిపురం: ఎస్.శ్రీనివాసులు స్మారక డ్యాన్స్ పోటీలను ఈనెల 23న నిర్వహిస్తున్నట్టు డ్యాన్స్ వారియర్స్ టీం ఓ ప్రకటనలో తెలిపింది. మంగళవారం సాయంత్రం 6 గంటల నుంచి దుంకుమాకనపల్లి (తుమ్మిశిరోడ్డు)లో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.10 వేల నగదుతో పాటు ఏడు అడుగుల ట్రోఫీ, 2వ బహుమతిగా రూ.7వేలతో పాటు ఆరు అడుగుల ట్రోఫీ, మూడో బహుమతిగా రూ.6వేలు, ఐదు అడుగుల ట్రోఫీ ఇస్తామని తెలిపారు. మొత్తం పది నగదు బహుమతులు, ట్రోఫీలతో పాటు ఉత్తమ కొరియోగ్రాఫర్ అవార్డు అందిస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8099170790, 9113555745 నంబర్లను సంప్రదించాలని కోరారు.

వారపు సంత వేలం రేపు

పెద్దపంజాణి: మండల కేంద్రంలో ప్రతి బుధవారం గ్రామ పంచాయతీ వారిచే నిర్వహించే వారపు సంతలో గేటు వసూలుకు 19వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు గ్రామ సచివాలయంలో సర్పంచ్ అఖిల ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించనున్నట్లు పీఎస్ సుబ్రమణ్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనేవారు రూ.18వేలు ధరావత్తు చెల్లించాలన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

గుడిపాల: కమ్మతిమ్మపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఇదే గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ లేట్ క్రిష్ణమందడి, కన్నమ్మ జ్ఞాపకార్థంగా చిత్తూరులోని సంజీవిని ఐకేర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఇందులో మనోరమ మల్టిస్పెషాలిటీ, మహేష్ ఆర్థో స్పెషలిస్ట్ క్లినిక్ వారు కూడా పాల్గొన్నారు. ఇందులో ముఖ్యంగా కంటి పరీక్షలు, బీపీ, షుగర్, ఎముకల సమస్యలు, మోకాళ్ల నొప్పులు, నడుం నొప్పి వారికి పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో 200 మంది రోగులు పాల్గొన్నారు. వారందరికీ ఉచితంగా మందులు అందజేశారు. ఈ వైద్యశిబిరంలో వైద్యులు ఉదయ్‌కుమార్, గీత అనూష, మహేష్‌రెడ్డి, నోబుల్ రావు, దుర్గాప్రసాద్‌లతోపాటు, ఉపాధ్యాయులు వెంకటేష్, లక్ష్మణరావు, సౌందర్‌రాజన్ పాల్గొన్నారు. వైద్య శిబిరానికి వచ్చిన వారందరికీ ఉచితంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.



వైద్యశిబిరంలో పాల్గొన్న వైద్యులు



రోగులకు ఆరోగ్య సూచనలు ఇస్తున్న వైద్యులు

నీటి నాణ్యతా పరీక్షలు గాలికి!





బండపై ఇండ్లు యానాదుల కాలనీలో నీటిని వడగట్టి పట్టుకుంటున్న దృశ్యం, కార్యాలయంలో మూలనపడిన నీటి నాణ్యతా పరీక్షల కిట్స్

- శుభ్రం చేయని ట్యాంకుల్లోని నీటి సరఫరా ప్రమాదం
- డైరెక్ట్ పంపింగ్‌తోనూ తప్పని కలుషితం
- పల్లెల్లో పలుచోట్ల పైపుల లీకేజీలు
- రోగాలకు కారణమవుతున్న వైనం

పలమనేరు: గ్రామాల్లో ప్రజలకు ప్రభుత్వం అందించే రక్షిత మంచినీరు పరిశుద్ధంగా ఉందా లేదా అనే పట్టించుకునే వారే కరువయ్యారు. నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో స్కీమ్‌బోర్ల పైప్‌లైన్లు దెబ్బతినడంతో అపరిశుభ్రమైన నీరే సరఫరా అవుతోంది. గ్రామాల్లోని సగం ట్యాంకులను శుభ్రం చేయడమే లేదు. కొందరు సర్పంచులు మాత్రం ట్యాంకులను కడిగిస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో విధిలేని పరిస్థితుల్లో ఈ నీటినే జనం తాగాల్సి వస్తోంది. వర్షాకాలం కాబట్టి కచ్చితంగా ప్రతినెలా పంచాయతీల పరిధిలో నీటి నాణ్యతా పరీక్షలు చేయాల్సి ఉన్నా వీటి గురించి పట్టించుకునే వారేలేరు. అంటువ్యాధుల కారణంగా ట్యాంకుల నుంచి నీటిని చాలాచోట్ల సరఫరా చేయకుండా బోర్ల నుంచి డైరెక్ట్ పంపిగ్ ద్వారా వదులుతున్నారు. అయితే పైప్‌లైన్ మరమ్మతుల కారణంగా డైరెక్ట్ పంపింగ్ నీళ్ల సైతం కలుషితమయ్యే పరిస్థితులున్నాయి. ముఖ్యంగా శుభ్రం చేయని ట్యాంకుల నుంచి కొళాయిలకు సరఫరా అయ్యే గ్రామాల్లో నీటి కలుషితం ఎక్కువగా ఉంది. నీటి నాణ్యతా పరీక్షలకు గత ప్రభుత్వం అందజేసిన కిట్లు, కెమికల్స్ సంబంధిత పంచాయతీ కార్యాలయాల్లో అటకెక్కాయి. ఇక ఈ ప్రభుత్వంలో ఇంకా వీటి గురించి ఆలోచనే లేదు. గ్రామాల్లో స్కీమ్‌బోర్లకు ఏర్పాటు చేసిన పైప్‌లైన్లు దెబ్బతిన్నాయి. ఫలితంగా నీరు నిల్వ ఉండి కలుషితానికి గురై జనానికి ఇబ్బందులకు గురిచేస్తోంది. వీటి మరమ్మతులకు సైతం స్థానిక సంస్థలకు నిధుల లేమి ఇబ్బందిగా మారింది. ఫలితంగా వ్యాధులు సోకుతున్నాయి. ఇది అసలే వర్షాకాలం కావడంతో సమస్య మరింత జఠిలమయ్యే అవకాశం ఉంది.

నీటి నాణ్యతా పరీక్షలు ఎక్కడ?..

మండలాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో నీటి నాణ్యత పరీక్షలు చేపట్టాల్సి ఉంది. దీనిపై అవగాహన కార్యక్రమాలను సైతం నిర్వహించాలి. వీరు ప్రతి పంచాయతీకి ఒక ఏఎన్ఎం, అంగన్‌వాడీ టీచర్‌ను ఎంపిక చేసి వారికి నీటి పరీక్షలు ఎలా నిర్వహించాలో శిక్షణనిస్తారు. ఇందుకు సంబంధించి కిట్లు, అవసరమైన రసాయనాలను పంపిణీ చేయాల్సి ఉంది. వీరు స్కీమ్ బోర్లలోని నీటిలో నైట్రేట్, ఫ్లోరైడ్, డీసాల్ట్ సాలిడ్స్, క్షార జలసాంద్రత, బీసీజీ–ఎంఆర్ నిర్వహించాల్సి ఉంది. దీంతోపాటు రక్షిత మంచి నీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలి. కానీ ఈ ప్రభుత్వంలో ఇంతవరకు దీనిపై శిక్షణ లేదు పరీక్షలు లేవు. ఈవిషయమై పలమనేరు ఎంపీడీఓ రాజేష్‌ను వివరణ కోరగా నీటి పరీక్షలకు సంబంధించిన కిట్లు ఇంకా అందలేదని, దీనిపై జేసీ వీసీ ఉందని త్వరలో కార్యక్రమాలు ఉండొచ్చని తెలిపారు.

సంక్షేమ హాస్టల్లో చర్యలు షురూ



ఎస్సీ హాస్టల్‌లో పనిచేస్తున్న వాటర్ ప్యూరిఫయిర్



హాస్టళ్లను తనిఖీచేస్తున్న ఏఎస్‌డబ్ల్యూఓ

పలమనేరు: పారిశుద్ధ్యం లోపించి తాగేందుకు సరైన మంచినీరు లేక దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్న సంక్షేమ హాస్టళ్లలో అవసరమైన సౌకర్యాలను సంక్షేమశాఖ అధికారులు బుధవారం చేపట్టారు. 'వసతి.. అధోగతి' అనే శీర్షికన మంగళవారం సాక్షి దినపత్రిలో ప్రచురితమైన కథనంపై స్థానిక సంక్షేమ శాఖ ఎస్‌డబ్ల్యూఓ హైమావతి తీవ్రంగా స్పందించారు. బుధవారం ఆమె పరిధిలోని అన్ని హాస్టళ్లను తనిఖీ చేశారు. అక్కడి సమస్యలను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని హాస్టల్ వార్డెన్లను ఆదేశించారు. దీంతో పట్టణంలోని ఎస్సీ బాలికల హాస్టల్‌లో మురుగునీటిని తొలగించారు. కలుషితమైన నీటి స్థానంలో మంచినీళ్ల ట్యాంకర్లను తెప్పించి నీటిని వేడిచేసి ఆపై పిల్లలకు పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నారు. అన్ని హాస్టళ్లలో దెబ్బతిన్న కిటికీ మెస్‌లను సరిచేశారు. పట్టణంలోని గుడియాత్తం రోడ్డులోని ఎస్సీ–1 హాస్టల్‌లో మరమమ్మతుకు గురైన ఫ్యాన్ల స్థానంలో హాస్టల్ వార్డెన్ మధుసూదన్‌రెడ్డి కొత్త ఫ్యాన్లను అమర్చారు. బీసీ హాస్టల్ వద్ద దోమలు రాకుండా గదులకు అవసరమైన చర్యలను వార్డెన్ సోమసుందర్‌రెడ్డి హుటాహుటిన తీసుకున్నారు. మరోవైపు సాక్షిలో వెలువడిన కథనం చూసి పలువురు దాతలు సైతం తమకు తోచిన సాయం చేసి హాస్టళ్లల్లో సమస్యల సాధనకు కృషి చేస్తామంటూ ముందుకొస్తున్నారు.